

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

FEBRUARY-2014

సంవత్సర చందా రూ.50/-

# ఆంధ్రప్రదేశ్ క్రీస్తు సంఘ సువార్తికులు
# సహవాస సదస్సు

**సమయము : 2014 ఫిబ్రవరి 20వ తేదీ గురువారం**

**ఉదయం : 10 గం॥నుండి సాయం 4 గం॥ల వరకు**

**స్థలము : క్రీస్తు సంఘము**

**ర్యాలి**

**వయా: రావులపాలెం, తూ॥గో॥జిల్లా**

ఆంధ్రప్రదేశ్‌లో పలుప్రాంతములలో సత్యసువార్తకొరకు పాటుపడుచున్న సువార్తికులతో సహవాసము కలిగి యుండుటకు ఇదొక మంచితరుణము. అనుభవజ్ఞులైన సోదరులు వాక్యోపదేశముగావించెదరు. మీరు తప్పక రండి. నిజక్రైస్తవ సహవాస మాధుర్యమును రుచి చూడండి మీకిదే ఆహ్వానము.

బ్రదర్ పి.యస్.ఆర్. జయపాల్
క్రీస్తుసంఘము - ర్యాలి
సెల్ : 9849128805

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH


P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**


*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 33 | ఫిబ్రవరి - 2014 | సంచిక - 7


## ధర్మశాస్త్ర మెందుకీయబడెను ?
## (Why was the Law given ?)

మోషే ధర్మశాస్త్రము యొక్క ప్రయోజనమును గూర్చి ఈ నాడు క్రైస్తవ లోకములో వివిధ భావములు లేకపోలేదు, "ధర్మశాస్త్రము మోషే ద్వారా కలిగెను" అని క్రొత్తనిబంధన బోధించుచున్నది (యోహాను 1:17). ధర్మశాస్త్రము అను పదము క్రొత్త నిబంధనలో ఇంచుమించు 150 సారులు వినియోగింపబడినది. క్రొత్తనిబంధనలో 'ధర్మశాస్త్రము' అను పదము ఎక్కడ కనబడినను అది మోషే ధర్మశాస్త్రమును గూర్చి చెప్పబడుచున్నదని మనము గుర్తించవలెను.

క్రైస్తవులయినవారు కూడ ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలను చేయవలెనని కొందరు అబద్ధ సిద్ధాంతమును బోధించుచుండగా పౌలు వారిని ఖండించెను. "నేను దేవుని కృపను నిరర్థకము చేయను; నీతి ధర్మశాస్త్రము వలనైతే ఆ పక్షమందు క్రీస్తుచనిపోయినది నిష్ప్రయోజనమే" యని అతడు గలతీ 2:21లో బోధించెను. గలతీ 3:19లో "ఆలాగైతే ధర్మశాస్త్రమెందుకు?" అనే ప్రశ్న మనకు కన్పించును. ధర్మశాస్త్రము లోపములు గలది గనుక

ఈప్రశ్న వేయవలసి వచ్చినది. "ఏలయనగా ఆమొదటి నిబంధన లోపము లేనిదైతే రెండవ దానికి అవకాశముండ నేరదు" (హెబ్రీ 8:7). ధర్మశాస్త్రము బలహీనమైనదని అపొ.పౌలు బోధించెను: "ధర్మశాస్త్రము దేనిని చేయజాలక పోయెనో దానిని దేవుడు చేసెను. శరీరముననుసరింపక ఆత్మననుసరించి యేనడుచుకొను మనయందు ధర్మశాస్త్ర సంబంధమైన నీతివిధి నెరవేర్చ బడవలెనని పాపపరిహారము నిమిత్తము దేవుడు తన సొంత కుమారుని పాప శరీరాకారముతో పంపి, ఆయన శరీరమందు పాపమునకు శిక్ష విధించెను అని అతడు రోమా 8:2-4లో వ్రాసెను. మోషే ధర్మశాస్త్రములో మనకు గోచరమగు ఒక బలహీనతయే మంటే, అందులో పాపముల సంపూర్ణ క్షమాపణ లభ్యము కాలేదు. ఆ ధర్మశాస్త్ర ప్రకారము బలులు అర్పించుట చేత ఏటేట పాపములు జ్ఞాపకమునకు వచ్చుచున్నవియే గాని, అర్పించు వానికి సంపూర్ణసిద్ధి కలుగ లేదు (హెబ్రీ 10:1-4). ధర్మశాస్త్రము నీతిని, నిత్యజీవమును అనుగ్రహించ లేకపోయెను. అయితే ధర్మశాస్త్ర మెందుకీ యబడెను? నిష్ప్రయోజనమైన దానివలె దానిని మనము ఎంచవలెనా ? అట్లు కానేకాదు. ధర్మశాస్త్రము కొన్ని ప్రాముఖ్య కారణముల వలన ఈయబడినది. వాటిని మనము ఇప్పుడు చూతము.

మొదటిగా ధర్మశాస్త్రము అతిక్రమములను బట్టి ఈయబడినది. గలతీ 3:19 లో అపొ.పౌలు ఇట్లు వ్రాసెను: "ఆలాగైతే ధర్మశాస్త్రమెందుకు? ఎవనికి ఆవాగ్దానము చేయబడెనో ఆసంతానము వచ్చు వరకు అది అతిక్రమములను బట్టి దానికి తరువాత ఈయబడెను". మానవజాతి అంతటికిని పాపము సహజలక్షణమై యుండెను. అనేకజనములు విగ్రహారాధకులై ప్రపంచమునంతటిని కలుషితము చేయ సంసిద్ధులై యుండిరి. అయితే ధర్మశాస్త్రము నిచ్చుట ద్వారా వాగ్దానము చేయబడిన సంతానము వచ్చువరకు ఒక జనాంగమును విగ్రహారాధన నుండి కాపాడుటకు దేవుడు సంకల్పించెను. ఈప్రజలు దేవుని యెడల నమ్మకస్థులై జీవించునట్లు మోషే ధర్మశాస్త్రము కఠినమైన ఆజ్ఞలను, కఠినమైన శిక్షలను కలిగి యుండెను. క్రీస్తు వచ్చి ఈలోకములో దేవుని చిత్తమును నెరవేర్చ వలెననిన, విగ్రహారాధన చేయు జనాంగములో ఆయన జన్మించుటకంటె నిజ దేవుని సేవించువారి మధ్య ఆయన జన్మించుట అవుసరమై యుండెను.

వాగ్దానము చేయబడిన సంతానమగు క్రీస్తు వచ్చువరకు అబ్రాహాము పిల్లలను ప్రత్యేకముగ యుంచుటలో ధర్మశాస్త్రము పనిచేసెను. అపొ.పౌలు ఇట్లు

వ్రాసెనుః "అబ్రహామునకును అతని సంతానమునకును వాగ్దానములు చేయబడెను; ఆయన అనేకులను గూర్చి అన్నట్లు సంతానములకును అని చెప్పక ఒకని గూర్చి అన్నట్టు -సంతానమునకును అనెను; ఆసంతానము క్రీస్తు నేను చెప్పునదేమనగా, నాలుగు వందల ముప్పది సంవత్సరములైన తరువాత వచ్చిన ధర్మశాస్త్రము, వాగ్దానమును నిరర్థకము చేయునంతగా పూర్వమందు దేవుని చేత స్థిరపరచబడిన నిబంధనను కొట్టివేయదు. ఆ స్వాస్థ్యము ధర్మశాస్త్ర మూలముగా కలిగిన యెడల ఇక వాగ్దాన మూలముగా కలిగినది కాదు. అయితే దేవుడు అబ్రాహామునకు వాగ్దానము వలననే దానిని అనుగ్రహించెను. ఆలాగైతే ధర్మశాస్త్రమెందుకు? ఎవనికి ఆవాగ్దానము చేయబడెనో ఆ సంతానము వచ్చువరకు అది అతిక్రమములను బట్టి దానికి తరువాత ఇయ్యబడెను; అది మధ్యవర్తి చేత దేవదూతల ద్వారా నియమింపబడెను" (గలతీ 3:16-19).

భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడునని దేవుడు అబ్రాహామునకు వాగ్దానము చేసినందున, ధర్మశాస్త్ర మీయబడవలసి వచ్చెను (ఆది 12:13). భూలోకము నంతటినీ ఆశీర్వదించు ఆ ఒక్కడే యేసుక్రీస్తు, వాగ్దానము చేయబడిన క్రీస్తు వచ్చువరకు మోషే ధర్మశాస్త్రము యూదులను అన్యులను వేరుపరచి ఒక అడ్డుగోడవలె నిలిచెను (ఎఫెసీ 2:14).

దేవుడు అబ్రాహామునకు చేసిన వాగ్దానము నెరవేర్చబడుటకై మోషే ధర్మశాస్త్రమీయబడెను. "నిన్ను ఆశీర్వదించు వారిని ఆశీర్వదించెదను; నిన్ను దూషించు వానిని శపించెదను; భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడునని" ఆదికాండము 12:2,3లో దేవుడు అబ్రాహామునకు వాగ్దానము చేసెను. ఈ వాగ్దానము చేయబడిన 430 సంవత్సరముల తరువాత ధర్మశాస్త్రమీయబడెను. రాజకీయముగాను, ఆత్మీయముగాను దేవుడు ఇశ్రాయేలీయులను రక్షించుటకొరకు వారికొక ప్రభుత్వమును, మోషే ధర్మశాస్త్రమును అనుగ్రహించెను.

పాపము యొక్క ఘోరస్థితిని తెలియజేయునట్లు కూడ ధర్మశాస్త్రమీయబడెను. ధర్మశాస్త్రమువలననే గాని పాపమనగా ఎట్టిదో నాకు తెలియక పోవును. పాపము పాపమైనట్లు అగుపడు నిమిత్తము ధర్మశాస్త్రమీయబడెనని రోమా 7వ అధ్యాయములో పౌలు వ్రాసెను. ధర్మశాస్త్రము వలన దేవుని పరిశుద్ధతయు, మానవుని పాపపుతత్వమును మరింత విపులముగ బయలుపరచబడినవి. అందు

వలన దేవుని సహాయము అత్యవసరమని మానవునికి గోచరమయినది.

మోషే ధర్మశాస్త్రము రాబోవు మేలుల ఛాయవలె పనిచేసెను (హెబ్రీ 10:1). క్రీస్తునందు కలుగబోవు మేలులను మనము గ్రహించు నిమిత్తము, తద్వారా మనకు బోధయు, బుద్ధియు కలుగు నిమిత్తము ధర్మశాస్త్రమీయబడెను. "ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధికలుగుటకై వ్రాయబడెను" (1కొరింథి 10:11). ఇశ్రాయేలీయులు అరణ్యమార్గమున ప్రయాణించుట క్రొత్తనిబంధనలో దేవుని ప్రజలను సూచించుచున్నది. ప్రత్యక్షగుడారము, దేవాలయము క్రీస్తు సంఘమును సూచించుచున్నవి. ఇశ్రాయేలీయులు బలిగా అర్పించు గొర్రె పిల్లలు దేవుని గొర్రెపిల్లయగు క్రీస్తుకు సాదృశ్యముగా యున్నవి. పాతక్రొత్త నిబంధనల వ్యత్యాసమును, వాటి వాటి స్థానమును బోధించుటకు అపో.పౌలు హాగరు శారాలు, ఇష్మాయేలు ఇస్సాకులను మాదిరిగ వినియోగించెను (గలతీ 4: 22-31). మోషేరాబోవు క్రీస్తుకు మాదిరిగ యుండెను (ద్వితీ 18:15; అపో.కా. 3:22). గనుక క్రైస్తవ్యమును అర్థము చేసికొనవలెనని ప్రయత్నించువాడు మోషే ధర్మశాస్త్రమును కూడ గ్రహించుకొనవలెను.

తరువాత, మనలను క్రీస్తునొద్దకు నడిపించుటకు మోషే ధర్మశాస్త్రము ఒక బాలశిక్షకునిగా లేక బడిపంతులుగా పనిచేసెను. "కాబట్టి మనము విశ్వాస మూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తునొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను. అయితే విశ్వాసము వెల్లడియాయెను. గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము" అని గలతీ 3:25లో అపో.పౌలు బోధించెను.

మోషే ధర్మశాస్త్రము ఎందు నిమిత్తము ఈయబడెనో ఆ ప్రయోజనము నెరవేర్చబడినందున అది ఇప్పుడు అమలులోలేకుండ పోయినట్లు కూడ మనము గ్రహించవలెను. అది వాగ్దానము చేయబడిన సంతానము, అనగా క్రీస్తు వచ్చు వరకు ఇయ్యబడెను. ఆ సంతానము క్రీస్తే. ఆయన ధర్మశాస్త్రమును సిలువకు మేకులతో కొట్టి దానిని ఎత్తివేసెను. "దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను, మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి దానిమీద చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసెను" అని కొలస్స 2:14లో వ్రాయబడియున్నది. ఆయన క్రొత్త నిబంధనను స్థిరపరచుటకు మొదటి

దానిని కొట్టి వేసెను (హెబ్రీ 10:9).

ఇప్పుడు మనము క్రీస్తు యుగములో యున్నాము మనము మోషేకుగాక క్రీస్తుకు విధేయత చూపవలెను. మోషే ధర్మశాస్త్రము ఎత్తివేయబడినందున మన విశ్వాసాచరణాల నిమిత్తము దానిని వెంబడింపరాదు. అట్లు చేసిన యెడల క్రీస్తు కృపనుండి తొలగి పోగలము. "మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులమని తీర్చబడువారెవరో వారు క్రీస్తులో నుండి బొత్తిగా వేరు చేయబడి యున్నారు, కృపలోనుండి తొలగిపోయి యున్నారు" అని గలతీ 5:4 చెప్పుచున్నది.

క్రీస్తు కృపను నీవు పొందవలెనంటే యేసుదేవుని కుమారుడని నమ్మి, నీ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. ఆయన కృపలో ప్రవేశించి ఆయనకు సంఘము ద్వారా సేవ చేయుము.

## పదిమంది కన్యకలను గూర్చిన ఉపమానము
## (The Parable of the Ten Virgins)
### మత్తయి 25:1-13

**పరిచయము:**

యేసు ప్రభువు అపొస్తలులకు పదిమంది కన్యకలను గూర్చిన ఉపమానము చెప్పెను (మత్తయి 25:3). ఎంతో ఘనముగా అగుపడుచున్న యెరూషలేము దేవాలయము నాశనమగునని యేసు చెప్పగా అపొస్తలులు అయననడిగిన ప్రశ్నలకు జవాబుగా ఈ ఉపమానము చెప్పబడెను (మత్తయి 24:3).

అపొస్తలులు నిజానికి యేసును మూడు ప్రశ్నలడిగిరి. అడిగినవి తేలిక ప్రశ్నలని అపొస్తలులు తలంచారు. (మత్త 24:3). గాని వారడిగిన రెండు ప్రశ్నలకు ప్రభువు తగురీతిగా సూటిగా జవాబిచ్చారు. అవి: 1) యెరూషలేము ఎప్పుడు నాశనమగును? (మత్తయి 24:4-35). 2) ఆయన రెండవ రాకడ ఎప్పుడు సంభవించును? (24:36-41). మెస్సీయ తిరిగి వచ్చినప్పుడు ఈ లోక నాశనము తోబాటు యెరూషలేము నాశనమై పోవునని అపొస్తలులు ఎన్నడు ఊహించ లేదు.

యేసువారిని విడిచి తిరిగివెళ్లి పోతారని వారెన్నడు గ్రహించలేక పోయారు. ఆయన ఎట్లు వెళ్తారు? దేని గుండా అగమనవుతారు? తదుపరి క్రైస్తవులైన వారివలె అపొస్తలులు కూడ ఆయన రెండవరాకడను గూర్చి గజిబిజి అయ్యారు. ఆదిమ క్రైస్తవులు క్రీస్తు రెండవ సారి త్వరలో వస్తారని కాంక్షించారు,

ఊహించారు (తీతు 2:13; 1థెస్స 4:13-18; 2 థెస్స 2:1-3). అబద్ధ క్రీస్తులను గూర్చి, రెండవ రాకడను గూర్చి మోసపోవద్దని యేసు అపొస్తలులను హెచ్చరించారు (మత్తయి 24:4-5; 23-26).

అపొస్తలుల ప్రశ్నలకు జవాబిచ్చిన వెంటనే ఆయన అయిదు ఉపమానముల ద్వారా తన బోధను బలపర్చారు. 1) ఇంటి యజమాని, దొంగను గూర్చి (మత్త 24:42-44). 2) నమ్మకమైన గృహనిర్వాహకుడు, దుష్టుడైన దాసుడు. 3) పదిమంది కన్యకలు (మత్త 25:1-13), 4) తలాంతులను గూర్చి (25:41-30), 5) గొప్ప అంత్యతీర్పు (మత్తయి 5:31-46). యేసు చేసిన బోధల రికార్డు ఎవ్విధమైన సూచన లేకుండా సంభవించు లోకాంతమును గూర్చి సిద్ధపడి యుండవలెనని, దానితో నిత్యత్వము ఆరంభమగునని యేసు తన శిష్యులను హెచ్చరించారు.

గ్రేడ్‌మిల్లర్ అనుసహోదరుడు ఈ ఉపమానము యొక్క సందర్భాన్ని గూర్చి ఇట్లు వ్రాసాడు. యేసు ప్రభువు సిలువ మీద మరణించకముందున్న వారములో ఈ ఉపమానము చెప్పబడెను. మత్తయి 21లో ఆయన యెరూషలేములో ఊరేగింపుగా ప్రవేశించుటను గూర్చి మత్తయి లిఖించాడు. తరువాత దినాల్లో ఆయన రూకలు మార్చు వారిని దేవాలయమునుండి తోలివేయుట చూస్తాము (మత్త 21:12-13). ఆయన విరోధులతో తర్కించారు (22:15-23,39). బోధించుటకు ఆయనకున్న అధికారమును సమర్థించుకొన్నారు (21:23-27). ప్రజలకు ఉపమానరీతిగా బోధించారు (21:28-41; 22:1-14).

ప్రభువు తన జీవితకాలంలో ఆఖరిగ మంగళవారమునాడు దేవాలయమునుండి బయలుదేరారు (24:1). ఆయన తన శిష్యులు కూడ కడవరిసారి ఆ దేవాలయమును సందర్శించగా యేసు "మీరు ఇవన్నియు చూచుచున్నారు గదా; రాతిమీద రాయి యొకటి యైనను ఇక్కడ నిలిచియుండ కుండా పడద్రోయబడునని వారితో చెప్పెను" (24:2). అటు తరువాత ప్రభువును, ఆయన శిష్యులును ఒలీవ కొండకు వెళ్లి అక్కడ కూర్చొనిరి. అక్కడ నుండి వారు యెరూషలేము పట్టణ వైశాల్యమును గంభీరమైన దేవాలయమును చూచుచుండిరి. ఆయన శిష్యులగు పేతురు యాకోబు, యోహాను, అంద్రెయ అను వారు ఆయన యొద్దకు ఏకాంతముగా వచ్చి, "ఇవి ఎప్పుడు జరుగును? నీరాకడకును ఈ యుగ సమాప్తికిని సూచనలేవి? మాతో చెప్పుమనిరి" 24:3).

**ఉపమానము :**

"పరలోక రాజ్యము తమ దివిటీలు పట్టుకొని పెండ్లికుమారుని ఎదుర్కొనుటకు బయలుదేరిన పదిమంది కన్యకలను పోలియున్నది. వీరిలో అయిదుగురు బుద్ధిలేనివారు, అయిదుగురు బుద్ధిగలవారు. బుద్ధిలేనివారు తమ దివిటీలతో కూడ సిద్దెలలో నూనె తీసికొని పోయిరి. పెండ్లి కుమారుడు ఆలస్యము చేయగా వారందరు కునికి నిద్రించుచుండిరి. అర్ధరాత్రివేళ ఇదిగో పెండ్లికుమారుడు, అతనిని ఎదుర్కొనరండి అను కేక వినబడెను. అప్పుడు ఆకన్యకలందరు లేచి తమ దివిటీలను చక్కపరచిరి గాని బుద్ధిలేని ఆ కన్యకలు–మాదివిటీలు ఆరిపోవుచున్నవి గనుక మీ నూనెలో కొంచెము మాకియ్యుడని బుద్ధిగలవారి నడిగిరి. అందుకు బుద్ధిగల కన్యకలు మాకును మీకును ఇదిచాలదేమో, మీరు అమ్మువారి యొద్దకు పోయి కొనుక్కొనుడని చెప్పిరి. వారు కొనబోవుచుండగా పెండ్లి కుమారుడు వచ్చెను, అప్పుడు సిద్ధపడి యున్నవారు అతనితో కూడ పెండ్లి విందుకు లోపలికి పోయిరి; అంతట తలుపు వేయబడెను. ఆతరువాత తక్కిన కన్యకలు వచ్చి –అయ్యా అయ్యా మాకు తలుపు తీయుమని అడుగగా అతడు –మిమ్మును ఎరుగనని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను, ఆ దినమైనను గడియయైనను మీకు తెలియదు గనుక మెలకువగా ఉండుడి" (మత్తయి 25: 1–13).

పదిమంది కన్యకలు ఉపమానము యూదులందరు ఆచరించు సామాన్యమైన ఆహ్లాదకరమైన వివాహ విందు సమయాన్ని వివరించుచున్నది. అనుదిన సంఘటనలనే ఉపమానములుగా వినియోగించి గొప్ప ఆత్మీయ పాఠములు నేర్పుటలో యేసుకు సాటియైన వారెవరు లేరు. అట్లుఆయన బోధించిన ఆత్మీయ సంగతులు జన సమూహముల హృదయములో చెరగని ముద్రవేసెను. పెండ్లి విందులకు ఒక అతిథిగానో, హెచ్చరికచేయువాని గానో వెళ్లుట యేసుకు క్రొత్తయేమీ కాదు (యోహాను 2; మత్త 9:15; 22:1–14; యోహాను 3:29).

కాబోయే వధూవరులు ఇంకా చిన్నగా యున్నప్పుడే యూదులలో పెండ్లి సహజంగా నిశ్చయించబడేది. యిది జరిగిన కొన్నాళ్లకు ప్రధాన కార్యక్రమము జరిగేది. పెండ్లి జరుగక కొన్ని నెలల ముందు ప్రదానము జరిగేది. ప్రదాన కార్యక్రమములో పెండ్లి కుమారుడు పెండ్లికుమార్తె తలిదండ్రులకు కట్నము యిచ్చేవాడు. ప్రదాన కార్యక్రమము జరిగిన తరువాత, వారింకా సహజీవనము చేయకుండి

నను, వారి వివాహము రద్దుచేయబడా లంటే విడాకులు అవసరము. ఈ ఒడంబడికలో అపవిత్రపరచబడిన భాగస్వామికి మరణ శిక్షవిధించబడేది (ద్వితి 22:23; మత్తయి 1: 19).

సంప్రదాయ ప్రకారము పెండ్లి రోజున పెండ్లి కుమారుడు తన వధువును తన తండ్రి యింటినుండి తన యింటికి తోడుకొని వెళ్లేవాడు. మార్గములో పెండ్లికుమారుని యొక్కయు, పెండ్లి కుమార్తె యొక్కయు మిత్రులు వారితో చేరేవారు. మిగతావారు విందు జరుగు పెండ్లికుమారుని గృహము దగ్గర వేచి యుండేవారు. ఆ విందులో సంతోష సంబరములో పవిత్రమైన కన్యకలు కూడ పాల్గొనుట కద్దు. నేటి మన సమాజములో పెండ్లి కుమార్తెతో కూడ అట్టి కొందరు వెళ్లుచు యుంటారు.

ఇట్టి పదిమంది కన్యకలు వివాహ పరివారము కొరకు కనిపెట్టుచు యుండిరి. పెండ్లికుమారుడు వచ్చుసరికి చాల రాత్రియగునని వారు తలంచిరి. అతని రాక ఆలస్యమగునుగాని ఎంత ఆలస్యమగునో వారెరుగరు. అతని రాక ఆలస్యమైనను పెండ్లికుమారుని ఎదుర్కొనుటకు అయిదుగురు కన్యకలు మాత్రము సరియైన విధముగా సిద్ధపడి యుండిరి. ఈ అయిదుగురు కన్యకలు తమ సిద్దెలలో నూనెతో సిద్ధ పడివచ్చిరి. చాల ఆలస్యము కాగా, ఆ పదిమంది కన్యకలు నిద్రించు చుండగా పెండ్లికుమారుడు వచ్చెను. గాని నూనె లేనందున తమ దివిటీలు ఆరిపోయిన 5గురు కన్యకలు, నూనెతో సిద్ధిపడివచ్చిన అయిదుగురు బుద్ధిగల వారిని నూనె అడుగగా అది వారికి దొరకలేదు. అదనపు నూనెకొరకు వారు ప్రయత్నించు చుండగా, మిగతా వారందరు పెండ్లి కుమారునితో లోపలికి పోయిరి. వెంటనే తలుపుమూయబడెను. కొంత సమయానికి సిద్ధపడని వీరు కూడ వచ్చి తలుపుతట్టగా వారికి ప్రవేశము నిరాకరించబడెను. ఈ అయిదుగురు ఇట్టి ఆలస్యమగునని గాని, వారికి ప్రవేశము నిరాకరించబడునని గాని ఎన్నడు తలంచ లేదు.

ఈ ఉపమానములో పెండ్లి కుమారుడు క్రీస్తు. 2 కొరింథీ 11:2లో యేసుక్రీస్తు పెండ్లికుమారుడు, సంఘము పెండ్లికుమార్తె. ఈ ఉపమానములో పెండ్లికుమార్తెను గూర్చి చెప్పబడలేదు. యేసు చేయు బోధకు అమె ఇక్కడ ప్రాముఖ్యము కాదు. క్రీస్తుసంఘ సభ్యులు కన్యకలకు గురుతుగా యున్నారు. సంపూర్ణసంఖ్యకు గురుతుగా యూదులు 10 సంఖ్యను వాడేవారు (ఉదా 1సమూయేలు 1:8లో పది మంది కుమారులు). పెండ్లి కుమారుని రాక ఆలస్యము యేసుక్రీస్తు రెండవ రాకడలో

ప్రకటించబడని ఆలస్యము. మూయబడిన ద్వారము - క్రీస్తు రాజ్యములో ప్రవేశించుటకు ఒకానొక ఘడియలో ద్వారము ఆకస్మాత్తుగా మూయబడుటను సూచించుచున్నది మూయబడిన తరువాత ఏరకమైన సిద్ధపాటు అనవసరము. బుద్ధిలేని కన్యకలకు ప్రవేశము ఎట్లు నిరాకరించబడెనో అట్లే అవిధేయులైన మూయబడుట సూచించుచున్నది. వారికి ప్రభువు ప్రవేశము నిరాకరించును (మత్తయి 7:21-23).

అన్ని కోణములనుండి ఈ పదిమంది కన్యకలు పవిత్రులే, నైతికంగా మంచివారే. అందులో అయిదుగురు సిద్ధపడియుండిరి, వారు మెలకువగా యుండి కనిపెట్టుచుండిరి. అందువలన వారు బుద్ధిగలవారనబడిరి. మిగతా వారు బుద్ధిలేని వారనబడిరి.

ప్రభువు రాజ్యమైన సంఘములో యుంటేనే సరిపోదు. ఏ తరములో యుండినవారైనా, సిద్ధపాటులేని వారికి ఈ ఉపమానము ప్రోత్సహించుచున్నది. ఈ ఉపమానము ద్వారా ఆయన రాకడ విషయమై మనకు యేమీ తెలియదు గనుక ఎల్లప్పుడు సిద్ధపడియుండాలనే మనము హెచ్చరింపబడుచున్నాము. క్రీస్తు రావడం తథ్యము. ఆయన రాకడ సమయం మాత్రం అనిశ్చయం.

**ముగింపు :**

వ్యక్తిగత బాధ్యతను గూర్చి, భ్రష్టత్వ అవకాశమును గూర్చి ప్రభువు విశదీకరించారు. బుద్ధిగలవారు బుద్ధిలేనివారితో తమ నూనెను పంచుకొనలేక పోయిరి. అట్లు చేస్తే అది వారికి, వీరికి కూడ సరిపడకపోవును. తదుపరి తీర్పు వ్యక్తిగత పరీక్షయని కూడ మనము గమనించాలి. తీర్పు సింహాసనము దగ్గర నశించిన వారి దరపున వాదించే వారు ఎవరు ఉండరు. అక్కడ ఎవ్విధమైన అదనపు సిద్ధపాటు కూడ అసంభవము (2 కొరింథీ 5:10; హెబ్రీ 9:27). క్రీస్తు రెండవ రాకడలో అదనపు సిద్ధపాటు కొరకు సమయం యేమీ ఉండదు.

ఇంకా యేమంటే, మత్తయి 24-25 అధ్యాయాలలో యేసు చెప్పిన దానిని బట్టి ఆయన ఎప్పుడు మరల వస్తారో ఎవనికి తెలియదు గనుక, ఆయన రాకడను గూర్చిన తేదీలు నిర్ణయించు వారందరు తప్పు. నిత్య ప్రాముఖ్యమైన ప్రశ్న యేమంటే, "క్రీస్తు మరల వచ్చినప్పుడు నేను సిద్ధముగా యున్నానా?" అనునదియే.

- లూయిస్ రష్‌మోర్

## 1. కొత్త నిబంధన సంఘము దైవికమైనది
## (The New Testament Church is Divine in Nature)

క్రీస్తు ఏ సంఘము నిమిత్తము చనిపోయెనో (అపో.కా. 20:28; ఎఫెసీ 5:25), దేనికి శిరస్సయి యుండెనో (ఎఫెసీ 5:23), దేనిని గూర్చి మనము బైబిలు నందు చదువగలమో అది బైబిలు సంబంధమైన అనేక నామకరణములతో పిలువబడినది. ఈ నామములు దైవిక మైనవై ఎల్లవేళలా దేవునిని యేసుక్రీస్తును ఘనపరచును (మత్తయి 16:16; అపో. కా. 2:47). అదేరీతిలో సంఘములో యుండు సభ్యులకును క్రొత్త నిబంధనలో దైవిక నామములీయబడినవి. ప్రభువు సంఘము యొక్కయు దాని సభ్యుల యొక్కయు దైవిక నామములను బైబిలునందు మనం ఎరిగిన తరువాత నేటి ఆధునిక సంఘనామములు, వాటి సభ్యులనామములు దైవిక అనుమతి బడసినవో కాదో తెలిసికొన వచ్చును.

**సంఘమునకు బైబిలు నామములు :**

ఖచ్చితంగా చెప్పాలంటే ప్రభువు సంఘముకు ఒక ప్రత్యేక నామము లేదు! అయితే బైబిలునందు కనబడు ప్రభువు సంఘనామములు వర్ణనాత్మకమైనవి. యివి సంఘము యొక్క తత్వమును, దేవునికి, యేసుక్రీస్తుకు దానికి గల సంబంధమును వర్ణించును.

సాధారణముగా నామములు ఒక వస్తువును, వ్యక్తిని, సంస్థను మిగతావాటితో వేరు చేయుటకు ఉపయోగింపబడును. అయితే వున్నది ఒకే ఒక్కటయితే దానిని వేరుపరచే వేర్వేరు నామములు అనవుసరము.

కేథలిక్ సంఘము, డినామినేషన్లు ఉద్భవించకముందు, బైబిలు నందున్న వర్ణనాత్మక నామములు ఒకే ఒక్క సంఘమును సూచించెను. అందులో గజిబిజి యేమీ లేదు ఏలయనగా అప్పుడున్నది ఒకే ఒక్క సంఘము. ఆ నామములన్నియు దాని స్థాపకునితో సంఘమునకు గల సంబంధమును సూచించెను. గాని ఇప్పుడైతే వేలకొలది డినామినేషన్లు ఉద్భవించుట వలన వాటి వివిధ నామములు ఒండొరులతోను, బైబిలులో యున్న సంఘముతోను వాటకి గల వ్యత్యాసమును సూచించు

చున్నది.

గనుక ప్రభువు సంఘమునకు బైబిలునంటున్న నామకరణములు బ్రేండ్ నామములు కావు. గాని డినామినేషన్ల కయితే వాటి వాటి ప్రత్యేక బ్రేండ్ నామములు యున్నవి. ప్రభువు తన యొక్క ఒకే ఒక్క సంఘము కొరకు చనిపోయెను. ఆయన ఒకే ఒక్క సంఘమును స్థాపించెను (మత్త 16:18). డినామి నేషన్ సంఘముల యితే ఒక రకమైన (బ్రేండ్) డినామినేషన్‌తో వేరుపరచు నామములు కలిగి యున్నవి. అవి బైబిలునందున్న ఒకే ఒక్క నిజ సంఘ మునకు, క్రొత్త నిబంధన క్రైస్తవ్యము నకు వేరుగా యున్నవి.

బైబిలులో యున్న ప్రభువు సంఘము దిగువ నామకరణములతో వర్ణించబడినది. "నా సంఘము" (మత్తయి 16:18), సంఘము (అపో. కా. 2:47; 8:1). దేవుని సంఘము (1 కొరింథీ 1:2), క్రీస్తు సంఘములు (రోమా 16:16), క్రీస్తు శరీరము (ఎఫెసీ 4:12), జీవముగల దేవుని సంఘము (1 తిమో 3:15), దేవుని ఆలయము (1కొరింథీ 3:16). క్రీస్తుయొక్క వధువు (ఎఫెసీ 5:21-32; ప్రక 22:17), తన ప్రియ కుమారుని రాజ్యము (కొలస్స 1:13), మరియు దేవుని మందిరము (1 తిమో 3:15). బైబిలు నందలి సంఘము దైవికనామమును ధరించుట ముఖ్యమే అయినను, ఆనామము ధరించుట ఒక్కటే ప్రభువు సంఘమునకు గుర్తింపు కాదు.

**సంఘ సభ్యులకు దైవిక నామములు :**

దేవుని ప్రజలు రెండు నిబంధనల లోను వివిధ నామములతో వర్ణించబడిరి. పాత నిబంధనలో వాడిన అనేక పదములు క్రొత్తనిబంధనలో కూడ వాడబడినవి. అయితే క్రొత్త నిబంధనలో దేవుని ప్రజలకు ఒక ప్రత్యేకమైన క్రొత్త నామము ఇయ్య బడినది.

రెండు నిబంధనలలోను దేవుని ప్రజలకు దిగువనామములు వాడబడినవి. అవయవములు (1 కొరింథీ 12:27), శిష్యులు (అపో.కా. 6:1; 20:7), విశ్వాసులు (అపో.కా. 5:14), పరిశుద్ధులు (అపో.కా. 9:13; 1 కొరింథీ 1:2). సహోదరులు (రోమా 8:14), మరియు దేవుని పిల్లలు (1యోహాను 3:1-2). మరియు దేవుని ప్రియులు (రోమా 1:7), దేవుని వారసులు (రోమా 8:17) మరియు

రాజులైన యాజకులు (1 పేతురు 2:9).

కొత్త నిబంధనలో దేవుని ప్రజలకియ్యబడిన మరి యొక నామము న్నది. దానిని గూర్చి కొన్ని వందల సంవత్సరముల ముందే ప్రవచింప బడెను. అన్యజనులు దేవుని రాజ్యము లోనికి (సంఘములోనికి) ప్రవేశించిన తరువాత, దేవుని ప్రజలందరు ఈ క్రొత్తనామముతో పిలువబడుదురని యెషయా ప్రవచించెను. అది యెహోవా నియమించిన క్రొత్తపేరని అతడు చెప్పెను (యెషయా 62:1-2; 56:5). కొర్నేలీ, తనయింటి వారు సంఘముతో చేర్చ బడిన తరువాత ఈ క్రొత్తపేరు, క్రైస్తవుడను నామము దేవుని ప్రజల కీయబడెను. (అపో.కా. 11:26). క్రొత్త నిబంధనలో క్రైస్తవుడను ఈ నామము మరి రెండు మారులు వినియోగించ బడెను. ఈ నామము ఒక వ్యక్తికిని తన విమోచకునికిని గల సంబంధమును ప్రత్యేకముగా వర్ణించును.

**ముగింపు :**

యుక్త వయస్సుగల ప్రతివాడు క్రైస్తవుడుగా మాత్రమే యుండుటకు ప్రయత్నించాలి. మరియు క్రైస్తవులతో మాత్రమే ప్రభువు యొక్క దైవిక సంఘము సమకూడి యున్నదని ఎరగాలి. డినామినేషనుల సంబంధ నామములు మానవ కల్పితములు. క్రైస్తవుడను దైవిక నామమును అవి పాడుచేయును. క్రైస్తవుడను నామము ఒక బ్రేండ్ నామము కాదు. అయితే ఒకడు క్రైస్తవుడు లేదా క్రైస్తవుడు కాదు!

**మీరు సత్యవాక్కు పాలు చందా చెల్లించారా? లేదా ఇప్పుడే 50/-రూపాయలు పంపించి మీ పత్రిక కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి.**

**- ఎడిటర్**

## నిత్యభద్రతను గూర్చి నీవు రూఢిపరచుకొనవచ్చును

## (You can be sure of Eternal Security)

"నీవే నిత్యజీవపుమాటలు గలవాడవు, నీవే దేవుని పరిశుద్ధుడవని మేము విశ్వసించి యెరిగి యున్నామని" పేతురు యేసుతో చెప్పెను (యోహాను 6:69).

దేవుని సేవించు విషయంలో మనం నిశ్చయత కలిగి యుండుట ప్రాముఖ్యము. మనము నిత్య భద్రతను కలిగి యున్నామని తెలిసికొనవచ్చునా? "దేవుని కుమారుని నామమందు విశ్వాసముంచు మీరు నిత్యజీవము గలవారని తెలిసికొనునట్లు నేను ఈ సంగతులను మీకు వ్రాయుచున్నానని" యోహాను చెప్పెను (1యోహాను 5:13). చదువరులు తమ రక్షణను గూర్చి నిర్ధారణ కలిగి యుండాలని యోహాను కోరాడు. మొదటి శతాబ్ధములో క్రైస్తవులు ఎట్లు నిర్ధారణ కలిగి యుండిరో అట్లే నేడు కూడ క్రైస్తవులు తమ రక్షణను గూర్చి నిర్ధారణ కలిగి యుండగలరు.

నిత్యభద్రతను గూర్చి రెండు విపరీత తలంపులు కలవు. "ఒకడు రక్షింపబడినట్లు తాను తెలిసికొనలేడనునది" మొదటిది "విశ్వాసియైనవాడు నిత్య నాశనమునొందునంతగా ఎన్నడు పాపము చేయలేడనునది" రెండవది. ఈరెండు తలంపులు తప్పే. విశ్వాసియైన వాడు పాపము చేయగలడు, నశించి పోగలడు. అతడు తన స్వాస్థ్యమును పోగొట్టుకొనగలడు, గలతీయ ప్రాంతములోని క్రైస్తవులకు పౌలు ఇట్లు వ్రాసాడు; "మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్పుబడువారెవరో వారు క్రీస్తులో నుండి బొత్తిగా వేరు చేయబడి యున్నారు. కృపలోనుండి తొలగిపోయి యున్నారు" (గలతీ 5:4). యేసుక్రీస్తుచే మేకులతో సిలువకు కొట్టబడి ఎత్తి వేయబడిన ధర్మశాస్త్రము చొప్పున నడుచుకొన ప్రయత్నించు క్రైస్తవులు కృపలో నుండి తొలగిపోయి యున్నారు (కొలస్స 2:14).

అట్లే హెబ్రీ పత్రిక లేఖకుడు కూడ క్రైస్తవులనిట్లు హెచ్చరించాడు: "కొందరు మానుకొనుచున్నట్టుగా సమాజముగా కూడుట మానక, ఒకని నొకడు హెచ్చరించుచు ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా ఆలాగు చేయుచు ప్రేమచూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము. మనము సత్యమును గూర్చిన అనుభవజ్ఞానము

పొందిన తరువాత బుద్ధి పూర్వకముగా పాపము చేసిన యెడల పాపములకు బలియిక ఉండదు గాని న్యాయపు తీర్పునకు భయముతో ఎదురు చూచుటయు విరోధులను దహింపబోవు తీక్షణమైన అగ్నియునికను ఉండును. ఎవడైనను మోషేధర్మ శాస్త్రమును నిరాకరించిన యెడల ఇద్దరు ముగ్గురు సాక్షుల మాట మీద కనికరింపకుండ వాని చంపించుదురు. ఇట్లుండగా దేవుని కుమారుని పాదములతో త్రొక్కితాను పరిశుద్ధపరచబడుటకు సాధనమైన నిబంధన రక్తమును అపవిత్రమైనదిగా ఎంచి కృపకు మూలమగు ఆత్మను తిరస్కరించిన వాడు ఎంత ఎక్కువైన దండనకు పాత్రుడుగా ఎంచబడునని మీకు తోచును ? " (హెబ్రీ 10:24-29).

బుద్ధిపూర్వకముగా పాపము చేసిన వానికి ఎక్కువైన దండన కలదు. వీరు సత్యము నెరిగిన తరువాత కూడ క్రీస్తును విసర్జించుచుండిరి. సత్యము నుండి తొలగిపోయిన వారి పరిస్థితిని గూర్చి పేతురు కూడ ఇట్లు చెప్పుచున్నాడు :

"వారు ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు విషయమైన అనుభవజ్ఞానము చేత ఈలోక మాలిన్యములను తప్పించుకొనిన తరువాత మరల వాటిలో చిక్కుబడి వాటి చేత జయింపబడిన యెడల వారి కడవరి స్థితి మొదటి స్థితి కంటె మరి చెడ్డదగును. వారు నీతి మార్గమును అనుభవ పూర్వకముగా తెలిసికొని తమకు అప్పగింపబడిన పరిశుద్ధమైన ఆజ్ఞనుండి తొలగిపోవుట కంటె ఆమార్గము అనుభవపూర్వకముగా తెలియకయుండుటయే వారికి మేలు, కుక్క తన వాంతికి తిరిగినట్టును కడుగబడిన పంది బురదలో దొర్లుటకు మళ్లినట్టును అని నిజమైన సామెత చొప్పున వీరికి సంభవించెను" (2పేతురు 2:20-22). "రాతి నేల నుండువారె వరనగా -వినునప్పుడు వాక్యమును సంతోషముగా అంగీకరించువారు గాని వారికి వేరు లేనందున కొంచెము కాలము నమ్మి శోధన కాలమందు తొలగిపోవుదురని" యేసు హెచ్చరించారు (లూకా 8:13). అంటే విశ్వాసియైన వాడు తొలగిపోవుట సంభవిస్తాదని ఆయన చెప్పారు. రక్షణ షరతులపూర్వకమైనదని ఈలేఖనములు తెలియజేయుయున్నవి.

తొలగిపోవుట సాధ్యమే. అయినంత మాత్రాన తొలగిపోనవసరము లేదు. ఒకడు పడిపోనవుసరం లేదు. దేవుడు మన పక్షముననున్నారని మనం తెలిసికొనాలి. "ఇట్లుండగా ఏమందుము? దేవుడు మన పక్షమున నుండగా మనకు విరోధి యెవడు?" (రోమా 8:31). మనం రక్షింపబడాలని

దేవుడు కోరుకొనుచున్నారు. అయితే ఆయన చిత్తమునకు విరుద్ధముగా నడుస్తు, రక్షించబడిన స్థితిలో యుండలేము.

**దీవెన కరమైన నిర్ధారణ :**

మనం సత్యమును తెలిసికొనగలము: "కాబట్టి యేసు, తనను నమ్మిన యూదులతో - మీరు నావాక్యమందు నిలిచినవారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని చెప్పెను" (యోహాను 8: 31-32).

**క్రీస్తునందున్న వారమని మనం తెలిసికొనవచ్చును :**

దేవుడేర్పరచిన స్థలములో దేవుడేర్పరచిన సమయములో యుండుట ఎల్లవేళలా ప్రాముఖ్యమే. ఓడలో ఉండుడియని దేవుడు చెప్పిన స్థలమందు దానిలో యుండుట అత్యవుసరము. నేడు మనం క్రీస్తునందుండుట అత్యవుసరము. ఆత్మీయాశీర్వాదములన్నీ క్రీస్తునందే యున్నవి. "మనప్రభువైన యేసుక్రీస్తు యగు తండ్రియైన దేవుడు స్తుతింపబడునుగాక. ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను" (ఎఫెసీ 1:3-4). రక్షణ క్రీస్తులో యున్నది. "అందుచేత ఏర్పరచబడిన వారు నిత్యమైన మహిమతో కూడ క్రీస్తుయేసునందలి రక్షణ పొందవలెనని నేను వారికొరకు సమస్తమును ఓర్చుకొనుచున్నానని". పౌలు చెప్పాడు (2 తిమో 2 :10). బాప్తిస్మము ద్వారా ఒకడు క్రీస్తులో ప్రవేశించును. "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొంధితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి" అని అందుకే పౌలు చెప్పెను (రోమా 6:3-4). ఒకడు క్రీస్తులో యున్నాడో లేడో తాను తెలిసికొనగలడు.

**దేవునితో సహవాసము కలిగియున్నట్లు మనము తెలిసికొనగలము :**

"నేను పరిపూర్ణుడను కాను, పాపము చేస్తు యుంటాను. అట్లయినప్పుడు దేవునితో సహవాసము కలిగియున్నానని నాకెట్లుతెలియును?" అని ఒకడు అడుగ వచ్చును. వాస్తవంయేమంటే అప్పుడప్పుడు ఏదో విధంగా అందరు పాపము చేస్తునే యుంటారు. మనలో ఎవడును పరిపూర్ణుడు కాడు. అపొ. యోహాను ఈసమస్యను గూర్చి ఇట్లు వ్రాసాడు.

"మే మాయన వలన విని

మీకు ప్రకటించు వర్తమానమేదనగా–దేవుడు వెలుగై యున్నాడు, ఆయన యందు చీకటి ఎంత మాత్రమును లేదు, ఆయనతో కూడ సహవాసము గలవారమని చెప్పుకొని చీకటిలో నడిచిన యెడల మన మబద్ధమాడుచు సత్యమును జరిగింపక యుందుము. అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల మనము అన్యోన్యసహవాసము గలవారమై యుందుము, అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును. మనము పాపము లేనివారమని చెప్పుకొనిన యెడల మనలను మనమే మోసపుచ్చుకొందుము; మరియు మనలో సత్యముండదు. మనపాపములను మనము ఒప్పుకొనిన యెడల ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును. మనము పాపము చేయలేదని చెప్పుకొనిన యెడల ఆయనను అబద్ధికునిగా చేయు వారమగుదుము. మరియు ఆయన వాక్యముమనలో యుండదు" (1 యోహాను 1:5–10).

ఒకడు చీకటిలో నడుస్తూ, నిజముగా దేవునితో సహవాసముకలిగి యున్నానని చెప్పుకోలేడు. అయితే మనము వెలుగులో(వాక్యప్రకారము) నడిచినయెడల, పాపములను ఒప్పుకొనుచు యుంటే ఆయన రక్తము మనలను పవిత్రులనుగా చేయును. మరల యోహాను ఇట్లు వక్కాణించాడు:" నా చిన్నపిల్లలారా, మీరు పాపము చేయకుండుటకై యీ సంగతులను మీకు వ్రాయుచున్నాను. ఎవడైనను పాపము చేసిన యెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రియొద్ద మనకున్నాడు. ఆయన మనపాపములకు మాత్రమే కాదు సర్వలోకమునకు శాంతికరమై యున్నాడు. మరియు మనమాయన ఆజ్ఞలనుగైకొనిన యెడల దీని వలననే ఆయనను ఎరిగి యున్నామని తెలిసికొందుము. ఆయనను ఎరిగి యున్నానని చెప్పుకొనుచు ఆయన ఆజ్ఞలను గైకొనని వాడు అబద్ధికుడు; వానిలో సత్యమే లేదు. ఆయన వాక్యము ఎవడు గైకొనునో వానిలో దేవుని ప్రేమ నిజముగా పరిపూర్ణమాయెను; ఆయన యందు నిలిచి యున్నవాడనని చెప్పుకొనువాడు ఆయన ఏలాగునడుచుకొనెనో ఆలాగే తానును నడుచుకొన బద్ధుడై యున్నాడు. మన మాయనయందున్నామని దీని వలన తెలిసికొనుచున్నాము" (1 యోహాను 2:1–6).

తండ్రియైన దేవుడు క్రీస్తువుని తండ్రి. "మనము దేవుని పిల్లలమని పిలువబడు

నట్లు తండ్రి మనకెట్టి ప్రేమనను గ్రహించెనో చూడుడి; మనము దేవుని పిల్లలమే. ఈ హేతువుచేత లోకము మనలను ఎరుగలేదు ప్రియులారా, ఇప్పుడు మనము దేవుని పిల్లలమై యున్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్షపరచబడలేదు గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము. ఆయనయందు ఈ నిరీక్షణ పెట్టుకొనిన ప్రతివాడును ఆయన పవిత్రుడై యున్నట్టుగా తన్ను పవిత్రునిగా చేసి కొనును" (1 యోహాను 3:1-3). ఆయనమన తండ్రి గనుక మన క్షేమమే కోరును మరియు ఆయన సహవాసము మనకు తప్పక అనుగ్రహించును.

**నిత్య జీవము మనకు కలదని తెలిసికొన గలము :**

"ఆసాక్ష్యమేమనగా - దేవుడు మనకు నిత్యజీవము దయ చేసెను. ఈ జీవము ఆయన కుమారుని యందు న్నది" (1 యోహాను 5:11). దేవుడు తన కుమారునియందు మనకు నిత్య జీవమునను గ్రహించును. "దేవుని కుమారుని అంగీకరించువాడు జీవము గలవాడు; దేవుని కుమారుని అంగీకరిం పని వాడు జీవములేనివాడే. దేవుని కుమారుని నామమందు విశ్వాసముంచు మీరు నిత్యజీవము గలవారని తెలిసి కొనునట్లు నేను ఈ సంగతులను మీకు వ్రాయుచున్నానని" యోహాను మరల పలికాడు (1 యోహాను 5:12-13).

ప్రస్తుతానికి ఈనిత్యజీవము నిరీక్షణలో యున్నది. "ఆ నిత్య జీవము ను అబద్ధమాడనేరని దేవుడు అనాది కాల మందే వాగ్దానము చేసెను" అని పౌలు వ్రాసాడు (తీతు 1:2). "నిత్య జీవమునను గ్రహింతుననునదియే ఆయన తానే మనకు చేసిన వాగ్దానము" (1 యోహాను 2:25). రాబోవు లోక మందు ఈనిత్య జీవము కలుగునని యేసుచెప్పెను. "అందుకు యేసు ఇట్ల నెను - నానిమిత్తమును సువార్త నిమిత్తమును ఇంటినైనను అన్నదమ్ముల నైనను అక్క చెల్లెండ్రనైనను పిల్లలనైనను భూములనైనను విడచినవాడు ఇప్పుడు ఇహమందు హింసలతో పాటు నూరం తలుగా ఇండ్లను అన్నదమ్ములను అక్క చెల్లెండ్రను తల్లులను పిల్లలను భూములను రాబోవు లోకమందు నిత్య జీవమును పొందునని మీతో నిశ్చ యముగా చెప్పుచున్నాను" (మార్కు 10:29-30).

**ఈనిత్య భద్రతను కలిగి యుండుట యెట్లు:**

మొదటిగా అదిషరతుల పూర్వకమైనదని గ్రహించాలి. యేసు

ఇట్లు చెప్పారు. "నేను నిజమైన ద్రాక్షా వల్లిని, నాతండ్రి వ్యవసాయకుడు నాలో ఫలింపని ప్రతి తీగెను ఆయన తీసి పారవేయును; ఫలించు ప్రతి తీగె మరి ఎక్కువగా ఫలింపవలెనని దాని లోని పనికిరాని తీగెలను తీసివేయును" (యోహాను 15:1-2). రెండవదిగా నీ యెడల యున్న దేవుని ప్రేమను గ్రమనించు కొనవలెను. "ఏలయనగా మనమింకను బలహీనులమైయుండంగా, క్రీస్తు యుక్త కాలమున భక్తిహీనుల కొరకు చనిపోయెను. నీతిమంతుని కొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు; మంచి వాని కొరకు ఎవడైన ఒక వేళ చనిపోవ తెగింపవచ్చును. అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు, ఎట్లనగా మన మింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతి మంతులముగా తీర్చబడి మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రత నుండి రక్షింపబడుదుము" (రోమా 5:6-9). మూడవదిగా క్రీస్తునందు విశ్వాసముంచుట ద్వారా (యోహాను 8:24), పాపముల విషయమై మారు మనస్సుపొంది (లూకా 13:3), క్రీస్తును ఒప్పుకొనుచు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది (అపో.కా. 2:38), క్రైస్తవుడవగుము.

క్రైస్తవుడవైన తరువాత ఆత్మీయ ఎదుగుదల కొరకు నీవు దేవుని వాక్యమనే ఆహారముసేకరించాలి, పేతురు ఇట్లు వ్రాసాడు. "ప్రభువు దయాళుడని మీరు రుచిచూచి యున్న యెడల సమస్తమైన దుష్టత్వమును సమస్తమైన కపటమును వేషధారణను అసూయను, సమస్తదూషణ మాటలను మాని క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై నిర్మలమైన వాక్యమను పాల వలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము ఆపాలను అపేక్షించుడి" (1 పేతురు 2:1-3). "మనుష్యుడు రొట్టె వలన మాత్రము గాక దేవుని నోటనుండి వచ్చు ప్రతి మాట వలన జీవించును" అని యేసు ప్రభువు చెప్పారు (మత్తయి 4:4). క్రీస్తు సంఘసభ్యుడుగా దేవుని నమ్మకముగా ఆరాధించుట ఒక గొప్ప ధన్యత. " కొందరు మానుకొనుచున్నట్టుగా, సమాజముగా కూడుట మానక ఒకని నొకడు హెచ్చరించుచు ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరియెక్కువగా అలాగున చేయుచు ప్రేమ చూపుటకును, సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్ప వలెనని ఆలోచింతము" (హెబ్రీ 10: 24-25).

విశ్వాసము నుండి తొలగిపోకుండా నమ్మకముగా ఉండుట ఎట్లో, మనరక్షణను గూర్చిఎట్లు నిర్ధారణ కలిగియుండగలమో, అపో. పేతురు ఇట్లు తెలియజేయుచున్నాడు : "ఆహేతువు చేతనే మీ మట్టుకు మీరు పూర్ణజాగ్రత్త గలవారై మీ విశ్వాసమునందు సద్గుణమును, సద్గుణమునందు జ్ఞానమును, జ్ఞానమునందు ఆశానిగ్రహమును, ఆశానిగ్రహమునందు సహనమును, సహనమునందు భక్తిని భక్తియందు సహోదర ప్రేమను, సహోదర ప్రేమయందు దయను అమర్చుకొనుడి. ఇవి మీకు కలిగి విస్తరించిన యెడల అవి మన ప్రభువైన యేసు క్రీస్తును గూర్చిన అనుభవజ్ఞాన విషయములో మిమ్మును సోమరులైనను నిష్ఫలులైనను కాకుండ చేయును. ఇవిఎవనికి లేక పోవునో వాడు తన పూర్వపాపములకు శుద్ధికలిగిన సంగతి మరచి పోయి, గ్రుడ్డివాడును దూరదృష్టి లేని వాడునగును. అందు వలన సహోదరులారా, మీ పిలుపును ఏర్పటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్తపడుడి. మీరిట్టి క్రియలు చేయువారైతే ఎప్పుడును తొట్రిల్లరు. ఆలాగున మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు యొక్క నిత్య రాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహింపబడును" (2పేతురు 1:5-11).

**ముగింపు :**

నీ నిత్య భద్రతను గూర్చి నీవు నిశ్చయత కలిగి యుండవచ్చును. యేసు మనకు ఈనిర్ధారణ నిచ్చుచున్నారు: నాగొర్రెలునా స్వరము వినును నేను వాటినెరుగుదును, అవినన్ను వెంబడించును, నేను వాటికి నిత్య జీవము నిచ్చుచున్నాను గనుక అవి ఎన్నటికిని నశింపవు. ఎవడును వాటిని నాచేతిలో నుండి అపహరింపడు. వాటిని నాకిచ్చిన నాతండ్రి అందరికంటే గొప్పవాడు గనుక నాతండ్రి చేతిలోనుండి యెవడును వాటిని అపహరింపలేడు" (యోహాను 10:27-29). మనము యేసు యొక్క మాటలను వినుచు ఆయనను వెంబడించునంత కాలము, తండ్రి చేతి లోనుండి మనలను ఎవడును తీసికొన లేడు. దేవుడు అందరికంటే గొప్పవాడు. పౌలు తన రక్షణను గూర్చిన నిర్ధారణ కలిగి యుండి ఇట్లనుచున్నాడు: "భూమి మీద మనగుడారమైన యీ నివాసము శిథిలమైపోయినను చేతి పనికాక దేవుని చేత కట్టబడినదియు నిత్యమైనదియునైన నివాసము పరలోకమందు మనకున్నదని యెరుగుదుము" (2కొరింథీ 5:1). యిట్టి భద్రత నీవును కలిగి యుండగలవు!!

- బిల్లీ బ్లేండ్

# భయముతో కూడిన భక్తి
## (Reverence))

గౌతే అను శిల్పకారుడు, "భయముతో కూడిన భక్తియే క్రైస్తవ్యము యొక్క ప్రాణము" అని చెప్పాడు, మొదటిగా నేను మోషేను గూర్చి ఆలోచించాను. అతడు మండుచున్న పొదను చూచుచున్నాడు గాని అది కాలిపోవుట లేదు, అప్పుడు దేవుడు "దగ్గరకు రావద్దు, నీపాదములనుండి చెప్పులు విడువుము, నీవు నిలిచియున్న స్థలము పరిశుద్ధ ప్రదేశము అనెను. మరియు ఆయన నేను నీతండ్రి దేవుడను, అబ్రాహాము దేవుడను, ఇస్సాకు దేవుడను యాకోబు దేవుడనని చెప్పగా మోషే తన ముఖమును కప్పుకొనెను" (నిర్గమ 3:5,6).

తదుపరి సంక్షోభములో యున్న ఇశ్రాయేలీయులు నాకు గురుతువచ్చారు, తమ రాజైన ఉజ్జీయా మరణించాడు. వారిలో యువకుడొకడు అత్యున్నత సింహాసనమందు ఆసీనుడై యున్న యెహోవాను నేను కన్నులార చూచితి ననుకొంటిని" అని అరిచాడు (యెషయా 6:5). "నేను ఎవని పంపెదనని" ప్రభువు యొక్క స్వరము అతడు వినగా, అతడు "చిత్తగించుము నేనున్నాను, నన్ను పంపుమని" వేడుకొనెను (యెషయా 6:8).

యేసు చేసిన మహత్కార్యము లను "సీమోను పేతురు చూచి యేసు మోకాళ్ల యెదుట సాగిలపడి ప్రభువా, నన్ను విడిచిపొమ్ము, నేను పాపాత్ము డనని చెప్పెను" (లూకా 5:8). భక్తి భావములను గూర్చి చెప్పబడిన ఈ సందర్భములు స్వల్పములేయనినేనెరు గుదును. గాని అవి కనీసము మూడు సంగతుల యొక్క ప్రాముఖ్యతను మనకు తెలియజేయుచున్నవి. అవేవనగా:

1) దేవుని సన్నిధిలో మనము పవిత్రమైన భయము కలిగి యుండాలి.

2) మనపాపపు తత్వమును నిశితముగా మనము ఎరిగి యుండాలి.

3) హృదయపూర్వకముగా దేవుని సేవకు సమర్పించుకొనాలి.

భక్తిభావములతో పనిచేయుచున్న వానిని చూడాలనుకొంటే అపో.పౌలును గమనించుము. "నామట్టుకైతే బ్రతుకుట క్రీస్తే" యని అతడు చెప్పుచున్నాడు (ఫిలిప్పీ 1:21). - జాన్ గిప్సన్

## సంక్షిప్త వార్తలు

2014 జనువరి రెండవ తేదీ గురువారం నాడు అమెరికా నుండి నలుగురు సోదరులు, ఇద్దరు సోదరీలు కాకినాడ సురక్షితముగా చేరుకొనిరి. వారెవరనగా: సోదరులు వారెవరనగా; సోదరులు నార్మన్ లైట్, మార్క్ రేనాల్డ్. బెన్ లైట్ మరియు జాషువా టేలర్, మరియు కోనీ రేనాల్డ్, ఏబీ రేనాల్డ్ అను సోదరీలు. వీరు పలు గ్రామములు, సంఘమలు దర్శించి వాక్యోపదేశము గావించి సహోదరులను ప్రోత్సహించిరి. జనువరి 2, 3 వ తేదీలలో వెంకటకృష్ణరాయపురంలో ఏర్పాటు చేయబడిన సువార్త కూటములలో పాల్గొని సోదరులు చక్కటి వాక్యపరిచర్యచేసిరి. కోనీ రేనాల్డ్ గారు స్త్రీలకు ప్రత్యేక ఉపదేశ కూడికలు నిర్వహించిరి. వెంకట కృష్ణరాయిపురంలో సోదరులు డి.రాజరత్నంగారు గొప్ప సేవ చేయుచున్నారు.

జనువరి 4వ తేదీ శనివారం బెండపూడిలోను, 5వ తేదీ ఆదివారం కాకినాడలోను పైనుదహరించిన సోదరులు వాక్యపరిచర్యచేయగా, కాకినాడలో ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. జనువరి 6వ తేదీ సోమవారం పశ్చిమగోదావరి జిల్లా పెదగరువు, తామరాడ గ్రామములను దర్శించి అక్కడ వాక్యపరిచర్య చేసిరి. 8వ తేదీ బుధవారం నీలపల్లిలోను, 9వ తేదీనాడు కొడవటి పూడిలోను వాక్యపరిచర్య చేసిరి. 10వ తేదీనాడు గోరింటలోను, 12వతేదీ నాడు కాకినాడలోను జరిగిన కూటములలో వాక్య సందేశము నిచ్చిరి. 13వ తేదీనాడు అమెరికాకు తిరిగి పయనమై తమ స్వదేశమునకు క్షేమముగా చేరుకొనిరి.

**2014** ఫిబ్రవరి మొదటివారమునకు ఆంధ్రప్రదేశ్‌లో క్రీస్తు సంఘము స్థాపించబడి **50** సంవత్సరములు నిండుచున్నవి. **1964** ఫిబ్రవరి **9**వ తేదీ నాడు జాషువా గూటం గారు జె.సి. బెయిలీ గారి ద్వారా క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మొట్టమొదటి క్రీస్తు సంఘ సభ్యుడనునది చదువరులకు విదితమే. గత **50** సంవత్సరములలోను ఆంధ్రప్రదేశ్‌లోను. భారత దేశమంతటా క్రీస్తు సంఘము పునరుద్ధరింపబడిన విధానము ఆలోచింపగా దేవుని బలమైన హస్తము, ఆయన కాపుదల విశదముగా యున్నది. యేసుక్రీస్తు మరల వచ్చు వరకు భారత దేశములో ఆయన సంఘము విశ్వాసములోను ఆచరణలోను నమ్మకముగా యుండును గాక !

## మీకొక గొప్పసదవకాశం

**సత్యవాణి** ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 20 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500/- రూ॥లు అగును. గాని మీరు 120/- రూ॥లు మాత్రమే మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్ విద్యార్థులకు, బోధకులకు తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరినీ స్థాపించండి.

# SATYA VANI

# 7-9-35, Sambamurthy Street,
Kakinada - 533 004. Ph: 0884- 2363722

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014

To

From:
SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004